సంగతి కట్టిపెట్టి ఉద్యోగ ప్రయత్నం చెయ్యాలని అమ్మ ప్రతిపాదన. ఉద్యోగం చెయ్యడమే మంచిదైతే 'అల్లూరామ్-సుధారామ్' కంపెనీలో తాను చూపించిన ఉద్యోగంలో చేరడం మంచిదని నాన్న సలహా.

రామారావు రావడం చూచి "రారా రామూ, రా. ఎక్కడికి కెళ్ళావ్?" అన్నారు నాన్న.

పిడుగు పడుతుందని రామారావు అనుకున్నదానికి వ్యతిరేకంగా జరగబోతోంది. నాన్న కోపంగా లేడు. నాన్నను చూస్తే భయం వెయ్యడం లేదు.

"ఎక్కడికి కెళ్ళావ్ రా పొద్దుటినుంచీ" అన్నది అమ్మ.

"అది సరేగాని, ఇక నువ్వు ఉద్యోగంలో చేరితే బాగుంటుందని అమ్మ అంటోంది" అన్నాడు చిన్నన్నయ్య.

"వదినావాళ్లూ కులాసాగా ఉన్నారా? పాపను తీసుకురాలేదేం" అన్నాడు రామారావు.

"చూచావా? వాడు వట్టి మొద్దు. ఉద్యోగంసంగతి అడుగుతూంటే వదినావాళ్ళ సంగతి మాట్లాడుతున్నాడు" అన్నాడు నాన్న.

"మీది మరీ సోద్యమండీ! అయిందానికీ కానిదానికీ వాణ్ణి అట్లా తిడ్తారేం" అన్నది అమ్మ, ఉద్యోగం వస్తున్న కొడుకుపై ఆపేక్షగా.

"నీ ఉద్దేశం ఏమిట్రా రామూ!" అన్నాడు చిన్నన్నయ్య.

"మీఅందరూ ఏమిచెయ్యమంటే అది చేస్తాను."

"నాకేం బాధ లేదు. మీ ఇష్టం. వస్తా మరి. వాడు కనిపించలేదని అమ్మ ఖబురు పెడితే వచ్చా. ఇంటిదగ్గర పిల్లలు ఏమిగోల చేస్తున్నారో" అన్నాడు చిన్నన్నయ్య.

"నేనూ కొంచెందూరం వస్తా పద" అన్నాడు రామారావు.

"వస్తానమ్మా" అంటూ చిన్నన్నయ్య బయలు దేరాడు.

"తొందరగా రారా రాముడూ. పొద్దుట్నించీ తిండి తినలేదాయె" అన్నది అమ్మ కొత్త ఆపేక్షతో.

రామారావుకు ఆకలిగా లేదు. బడలికగా లేదు. ఏదో ఉత్సాహం! ఓహ్! ఉద్యోగం చేయబోతున్న ఉత్సాహం!

"మీరు కానివ్వండమ్మా. ఇప్పుడే వస్తా" అంటూ రామారావు కూడా బయలుదేరాడు.

కొంచెం దూరం అన్నదమ్ము లిద్దరూ మౌనంగా నడిచారు.

"కోపం వచ్చిందా అన్నయ్యా" అన్నాడు రామారావు, నాయరు కిల్లీకొట్టు దగ్గర ఆగి.

"కోపం ఎందుకూ?" అన్నాడు చిన్నన్నయ్య.

"నాయర్, రెండు సోడాలు, అరపౌను చాక్లేట్లూ ఇవ్వు" అన్నాడు రామారావు.

"ఉద్యోగం రాకముందే..." అన్నాడు చిన్నన్నయ్య.

"ఎవరికి ఇస్తే నాకేం? నా కేమీ ఇవ్వలేదుగా?"

"ఇవ్వమంటావా?"

"మళ్లీ అదేమాట. అబ్బే! ఏం బాగాలేదు....అది అట్లా ఉంచండి. నెలనెలా పదిరూపాయలు మీ పేర బ్యాంకులో ఎందుకని వెయ్యలేదూ?"

"డబ్బు ఏదీ?"

"ఏదీ? నన్ను అడుగుతారేం? ఉద్యోగం సంపాదించా నంటున్నారు. అని నా వంక ఆశగా...నాకుకూడా బాధగా ఉన్నది. ఇంకా ఎన్నాళ్లని అనిపిస్తోంది...కాని... ఇది సాధ్యమా...మీవాళ్లు ఒప్పుకుంటారా..." అని ఖాజా బీబీ ఏడ్చింది. ఆ యేడ్పు రామారావుకు కనువిప్పు అయింది.

ఖాజా బీబీ తనకు కావాలి. ఖాజా బీబీ తెలివిగలది. ఖాజాకు అన్నీ తెలుసు. ఈ పెండ్లికి నాన్న ఒప్పుకోడు. నాన్నే కాదు. ఎవరూ ఒప్పుకోరు. పెండ్లి కాకుండా ఖాజా తనవశం కాదు. తనకు దూరంకాదు. తనతో తగాదాపడినా మళ్లీ ఖాజాయే తనను పలకరించి లాలిస్తుంది. నిజానికి ఖాజా చెప్పిందాంట్లో బేసబబేమిటీ? తనదగ్గర చిల్లిగవ్వ లేదు. మూడు సంవత్సరాలు ఉద్యోగంచేసినా తనదగ్గర చిల్లిగవ్వలేదు. బోనసుగా వచ్చిన నాలుగువందలూ కూడా నాన్నకే ఇచ్చాడు. "మరి ఈ పెండ్లి కారణంగా తగాదా వస్తే...ఏమి చెయ్యాలీ? ఎట్లా? ఎట్లా?" అని రామారావు మథనపడుతున్నాడు.

"కాపలా వేశారని ఆదిలక్ష్మికి తెలియదు. దానినే నిఘా అంటారు మీ భాషలో. ఎట్లాగయినా నువ్వు ఈ పని సాధించాలి మరి. ఇక వెళ్ళు."

అక్కడినుంచి సి. ఐ. డి. అబ్దుల్లాదగ్గరికి వెళ్ళింది ఖాజా. వాడు మొదట్లో తిట్టాడు. "హాయిగా కులంవాణ్ణి చేసుకోక, ఇదేమి రోగం" అన్నాడు. కాని, ఆశ్చర్యం, వాసుదేవరావు పేరు చెప్పగానే "చేతనైన సహాయం చేస్తా"నన్నాడు. "రంగారావు ఆదిలక్ష్మి ఇంట్లోనే ఉన్నాడని పోలీసులకు తెలుసు"నన్నాడు. "మరి ఎందుకని పట్టుకోలే" దని అడిగితే నవ్వాడు. "నీకు లోకంసంగతి తెలియ"దన్నాడు. "ఇంత అన్యాయమా" అని ఖాజా ఆక్రోశించింది. "అంత అన్యాయం లోకంలో ఉన్నది కనుకనే ఇంతమంది తనవంటి వాళ్ళకు ఉద్యోగాలు దొరికిన" వన్నాడు అబ్దుల్లా. "మరి అయితే నాకు సహాయం చెయ్యవా ?" అన్నది ఖాజా. అని ఏడ్చింది. అబ్దుల్లాకు ఏడుపు వచ్చినంత పని అయింది. "ఇది వట్టి అమాయకురాలు. ఆ శాపనాయనను విడిపిస్తే తన కేదో వరుగుతుందని ఆశపడుతోంది. సుబ్బయ్యగారి సంగతి తనకు తెలుసు. ఇటువంటి ఆటలు ఆయనముందు సాగవు. అయినా అసలు రామారావుమీద కేసు నిలుస్తుందని ఎవరు అనుకొంటున్నారూ ? పోలీసులందరికీ తెలుసు. అయినా నేరానికి సంబంధించినవాళ్ళందరిలో ఓరకం భయం కలిగించటం పోలీసులపద్ధతి. కొంచెం నిదానిస్తే సంగతంతా తెలుస్తుంది. దోషులు బయటపడ్తారు. అయినా ఈ నేరంలో

రామారావును కాపాడారు. అంతా అయిన తరువాత ఇవాళ రామారావు మీ అబ్బాయి అయినాడు. పాపం... ఏమైనాడో మరి!''

''మరి వాళ్ళ సాక్ష్యం మనకు కావాలి కదండీ'' అన్నాడు ఇన్‌స్పెక్టరు. ఇన్‌స్పెకరును వెంటపెటుకునే వెళ్లాడు సుబ్బయ్యగారు.

''కావలసివస్తే వాయిదాకు వస్తాడు.....అయినా నాకెందుకూ అదంతా? మీరు చూచుకోవలసిన సంగతి అది. అంతేనా ?'' అన్నాడు లల్లూరామ్ నవ్వుతూ.

''ఏడిసినట్టే ఉన్నది'' అనుకొంటూ సుబ్బయ్యగారు ఇంటికి బయలుదేరాడు.

* * *

బొంబాయిలో 'లల్లూరామ్-సుధారామ్' కంపెనీ కొత్త మేనేజరు రామారావు ఖాజాబీబీ వెంటలేకుండా సినిమాకయినా వెళ్ళడట మరి !

''ఇదేం న్యాయమండీ ! ఆయనగారిని ఇక్కడినుంచి పంపించేస్తే ఆ ముసలాయనపని ఏమవుతుందనుకున్నారూ?'' అన్నది కమల.

''ఇక్కడినుంచి వెళ్లాడు. జీతం పెరిగింది. నాయనకు డబ్బు పంపించవద్దని నేను చెప్పలేదుగా'' అన్నాడు వాసు.

* * *

''ఇక వాడు నా కొడుకూ కాదు. నేను వాడి తండ్రినీ కాదు'' అన్నాడు హనుమాయమ్మగారితో సుబ్బయ్యగారు. నెల నెలా మణియార్డరు వస్తూందని తెలుసో తెలియదో మరి!